తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
31-08-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 203
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## రియల్‌ఎస్టేట్ సంస్థగా కాంగ్రెస్ ప్రభుత్వం



- రూ.500 కోట్ల విలువైన భూమిని రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించే యత్నం
- ఆయిల్‌ఫెడ్‌కు భూమి దక్కకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- 1987 సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శ
- ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని వ్యాఖ్య
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే న్యాయ, ప్రజా పోరాటం

**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:** నగరం నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ సంస్థగా మారిపోయిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ సమాజ సంక్షేమాన్ని పక్కనబెట్టి కమీషన్ల కోసం వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అజామాబాద్ భూముల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సుదీర్ఘ బహిరంగ లేఖ రాశారు.

మిగతా 2వ పేజీలో..

## వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ



- కుటుంబ పాలనకు ముగింపు..
- ప్రజలకు చేరువైన పాలన ప్రజావాణి, గ్రామసభలతో ప్రజల ముంగిటకు ప్రభుత్వం 3.42 కోట్ల మందికి ఉచిత సన్నబియ్యం పంపిణీ
- కులగణన, ఎస్సీ వర్గీకరణలో ముందడుగు అప్పల భారంలోనూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

2



# ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్..
# ఆన్‌గ్రౌండ్‌లో రేవంత్

- డిజిటల్ ప్రచారంలో దూసుకెళ్తున్న ప్రతిపక్షం
- ప్రజల్లోకి వెళ్లడానికే సీఎం ప్రాధాన్యం
- మాస్ డైలాగ్స్‌తో రాజకీయ వేడి
- గ్రామీణ ఓటర్లపై ప్రత్యక్ష ప్రభావం
- డిజిటల్ బలహీనతను పర్యటనలతో భర్తీ చేసే యత్నం

**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:** తెలంగాణ రాజకీయాల్లో ప్రచార పోరు కొత్త రూపు సంతరించుకుంటోంది. బీఆర్ఎస్ డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రభుత్వంపై విమర్శలను విస్తృతంగా ప్రచారం చేస్తుండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం క్షేత్రస్థాయి రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కంటే ప్రజలను నేరుగా కలవడం, బహిరంగ సభలు, జిల్లాల పర్యటనల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంపైనే దృష్టి సారిస్తున్నారు.

**డిజిటల్‌లో కాంగ్రెస్ వెనుకంజ**

తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఉన్నంత బలమైన సామాజిక మాధ్యమ వ్యవస్థ కాంగ్రెస్‌కు లేకపోవడం రాజకీయంగా ప్రతికూలంగా మారుతోంది. గత పదేళ్లలో బీఆర్ఎస్ నిర్మించుకున్న డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా ప్రభుత్వంపై విమర్శలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగుతోంది. దీనికి సమర్థంగా దీటైన ప్రచార వ్యవస్థను కాంగ్రెస్ ఇంకా నిర్మించుకోవాల్సి ఉంది. ఈ లోటును రేవంత్ రెడ్డి తన పర్యటనలు, బహిరంగ సభలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. తరచూ జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలవడం ద్వారా ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో మద్దతు పెంచుకోవాలని భావిస్తున్నారు.

**మాస్ ప్రసంగాలతో రాజకీయ వేడి**

రేవంత్ రెడ్డి ప్రసంగాలు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కావడం లేదు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు, ఘాటు వ్యాఖ్యలతో రాజకీయ

మిగతా 2వ పేజీలో..

## మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

- రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం
- 14.5 మీటర్ల వెడల్పుతో వంతెన.. 3.5 మీటర్ల ఫుట్‌పాత్
- అంబర్‌పేట్–మూసారాంబాగ్ మధ్య ఏడాది పొడవునా రాకపోకలు
- వర్షాకాలంలో ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం
- ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కర్ణన్ ఆదేశం



2

## తెలంగాణలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సన్నాహాలు

- గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ గుర్తొచ్చేలా ఏర్పాట్లు
- జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలు
- ఏర్పాట్లకు రూ.1,000 కోట్లు మంజూరు
- భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం
- శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం

3





## వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

- మొక్కలు నాటడంతో బాధ్యత తీరదు.. సంరక్షణే కీలకం
- 6.18 కోట్ల మొక్కల నాటడమే లక్ష్యం
- ఇప్పటికే 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు వెల్లడి
- గుంతల తవ్వకంలో 92 శాతం.. నాటడంలో 91 శాతం పురోగతి
- 2.75 కోట్ల పండ్ల మొక్కల పంపిణీకి ప్రణాళిక

2



## ఆర్ఎస్ఎస్‌పై ఒవైసీ ఘాటు విమర్శలు

- ముస్లింలపై తియ్యటి మాటలు చెప్పడం మానండి
- ఆర్ఎస్ఎస్ పాత సిద్ధాంతాలను ప్రజలకు చెప్పాలి
- గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ విమర్శలు
- మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ప్రపంచానికి ఒక మాట.. కార్యకర్తలకు మరో మాట అన్న ఒవైసీ

2

## కులగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్

- దేశవ్యాప్తంగా కులగణనను తప్పనిసరి చేయాలని డిమాండ్
- ప్రతి కులానికి ప్రత్యేక కోడ్‌తోనే జనగణన చేపట్టాలి
- ఓబీసీలు, జనరల్ వర్గాలకు ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలి
- శాస్త్రీయ విధానం లేకుంటే రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా
- డిమాండ్లు పట్టించుకోకుంటే దేశవ్యాప్త ఉద్యమం

2






## నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం

- వరద బాధితుల ఆచూకీ కోసం కేంద్రంతో తెలంగాణ భవన్ నిరంతర సంప్రదింపులు
- సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి
- టిబెట్ నుంచి నేపాల్ మీదుగా భారతీయుల తరలింపు
- తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం
- డీఎన్ఏ కోసం కుటుంబ సభ్యులు నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడి

3



## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ

- ఉదయం 10 గంటలకు ఉభయ సభల సమావేశాలు ప్రారంభం
- అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చకు సీఎం రేవంత్ సవాల్

2

## మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

- ‘డోస్ట్ లిక్’ పతకం ప్రదానం.. శాశ్వత భారత్–ఉజ్బెకిస్థాన్ బంధానికి అంకితం
- మోదీకి దక్కిన 36వ అంతర్జాతీయ పురస్కారం..
- ఈ గౌరవం 140 కోట్ల మంది భారతీయులదన్న ప్రధాని

4



# ఆర్ఎస్ఎస్‌పై ఒవైసీ ఘాటు విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:

భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించే వారు హిందువులు కాదంటూ న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రపంచం ముందు ఒకలా, తమ కార్యకర్తలకు మరోలా మాట్లాడటం పాత వ్యూహమని ఆరోపిస్తూ ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు.

**పాత సిద్ధాంతాలేంటని ప్రశ్న**

ఆర్ఎస్ఎస్ భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని ఒవైసీ పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ గాంధీజీ నాయకత్వంలోని హిందూముస్లిం ఐక్యతను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారని, ఆ విషయాన్ని ఆర్ఎస్ఎస్ ప్రచురించిన ఆయన జీవిత చరిత్రలోనే పేర్కొన్నారని తెలిపారు.

**గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ**

ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ఒవైసీ ఆరోపించారు. 1940లో ఎం.ఎస్. గోల్వాల్కర్ ఒకే జెండా, ఒకే నాయకుడు, ఒకే సిద్ధాంతం గురించి పేర్కొన్నారని తెలిపారు. గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్'లోని 'ఇంటర్నల్ త్రెట్స్' అధ్యాయాన్ని ప్రస్తావిస్తూ ముస్లింలు, క్రైస్తవులను దేశానికి ముప్పులుగా పేర్కొన్నారని విమర్శించారు.

**తియ్యటి మాటలు మానాలని డిమాండ్**

ఉమ్మడి పౌరస్మృతి, మతమార్పిడి నిరోధక చట్టాలు, యూఏపీఏ వంటి అంశాలను ప్రస్తావిస్తూ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఒవైసీ ఆరోపించారు. 2002 గుజరాత్ అల్లర్లలో ముస్లింలపై జరిగిన హింసను కూడా ప్రస్తావించారు. భగవత్ బయటకు తియ్యటి మాటలు చెప్పడం మానుకుని హెడ్గేవార్, గోల్వాల్కర్, సావర్కర్ రచనల్లోని అంశాలను ప్రజలకు బహిరంగంగా చదివి వినిపించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ అసలు సిద్ధాంతాన్ని ప్రజలు అప్పుడే అర్థం చేసుకుంటారని వ్యాఖ్యానించారు.




# కులగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్

హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:

దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా యూనిక్ కోడ్ కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం వచ్చే వరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం 'జనగణనలో కులగణన-ప్రతి కులానికి యూనిక్ కోడ్' ప్రధాన డిమాండ్‌తో ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహించారు. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి. చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది.

**ప్రత్యేక కోడ్‌తోనే గణన**

ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ విధానం కాదని సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలో ఓబీసీలు, జనరల్ వర్గాలకు కూడా ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**సదస్సుకు పలువురు నేతలు**

రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా**

శాస్త్రీయ ప్రణాళిక లేకుండా జనగణన చేపడితే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని ప్రొఫెసర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఎంపీ విల్సన్ హెచ్చరించారు.
ప్రతి కులాన్ని కచ్చితంగా నమోదు చేసేలా పారదర్శక, శాస్త్రీయ విధానాన్ని కేంద్రం తక్షణమే అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

# మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:


చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2022లో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రూ.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో 400 మీటర్ల పొడవైన వంతెనను నిర్మించారు. 14.5 మీటర్ల వెడల్పుతో నిర్మించిన వంతెనపై పాదచారుల కోసం 3.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు.

**ఏడాది పొడవునా రాకపోకలు**

వంతెన అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట్ -మూసారాంబాగ్ మధ్య అన్ని కాలాల్లో రాకపోకలకు అవకాశం కలగనుంది. ముఖ్యంగా వర్షాకాలంలో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు ఏర్పడే నీటి ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.రెండు ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు సురక్షితమైన, నిరంతరాయ ప్రయాణం అందుబాటులోకి రానుంది.

**కమిషనర్ కర్ణన్ సమీక్ష**

మూసారాంబాగ్ వంతెనతో పాటు నల్గొండ ఫ్లైఓవర్ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్



ఆర్వీ. కర్ణన్ ఆదివారం తనిఖీ చేశారు. రెండు ప్రాజెక్టుల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**చంచల్‌గూడ ఫ్లైఓవర్ పనులు**

చంచల్‌గూడ ఫ్లైఓవర్ ప్రధాన నిర్మాణం పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ప్రారంభోత్సవానికి మార్గం సుగమం చేసేలా ఏ4 అప్ ర్యాంప్ పనులను ఆదివారమే పూర్తి చేయాలని ఆదేశించారు. చంపాపేట్ వైపు వెళ్లే ఏ3 సైడ్ ర్యాంప్ పనులను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే చంచల్‌గూడ, సైదాబాద్, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్, ఒవైసీ ఆస్పత్రి, కంచన్‌బాగ్, చంపాపేట్, సాగర్ రోడ్ మార్గాల్లో ప్రయాణించే వారికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని కర్ణన్ తెలిపారు.

# వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ

హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర ప్రస్థానంలో కీలక మైలురాయని రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ప్రభుత్వం మారడమే కాకుండా తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధరించబడిందని పేర్కొన్నారు.
ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమైందని ఆరోపించారు.

**ప్రజలకు చేరువైన పాలన**

మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు కూడా గత పాలనలో విలువ లేకుండా పోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సచివాలయాన్ని ప్రజలకు దూరం చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిరంకుశ సంస్కృతికి ముగింపు పలికిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటోందని, మంత్రులు ప్రజల మధ్యకు వెళ్తున్నారని, శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.
ప్రజావాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చామని పేర్కొన్నారు.

**సంక్షేమానికి పెద్దపీట**

ప్రజాస్వామ్య పునరుద్ధరణతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పౌర సరఫరాల రంగంలో కీలక సంస్కరణలు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులైన లక్షలాది కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు,



వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని పేర్కొన్నారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం**

సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి తెలిపారు. సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణలో సాధించిన పురోగతి సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిల్చిన భారీ అప్పులు, బడ్జెట్ వెలుపలి రుణాలు, పెండింగ్ బకాయిలు, అసంపూర్తి ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉందని తెలిపారు.
అయినప్పటికీ భారీ రుణాలు, వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు అభివృద్ధికి పెట్టుబడులను పెంచామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**కుటుంబ పాలనకు ముగింపు**

బీఆర్ఎస్‌కు ఆందోళనలు చేసే స్వేచ్ఛ ఉండటమే తెలంగాణలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందనడానికి నిదర్శనమని మంత్రి అన్నారు. అయితే తమ వెయ్యి రోజుల ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు చెరిపివేయలేవని స్పష్టం చేశారు. కుటుంబ పాలన నుంచి ప్రజా పాలన వైపు తెలంగాణ నిర్ణయాత్మకంగా అడుగులు వేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:

వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా పచ్చని, ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా మలచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.
ఆదివారం ప్రజాభవన్‌లో కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి వన మహోత్సవం పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు.
జిల్లాల వారీగా మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**లక్ష్యానికి చేరువగా**

ఈ ఏడాది 6.18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు.
గుంతల తవ్వకంలో 92 శాతం, మొక్కలు నాటడంలో 91 శాతం పురోగతి సాధించినట్లు



తెలిపారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీతక్క.. వాతావరణం అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**మొక్కల సంరక్షణే ముఖ్యం**

మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు. వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.
నాటిన ప్రతి మొక్క మనుగడ సాధించేలా గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

**కుటుంబ ఆరోగ్యానికి పండ్ల మొక్కలు**

పండ్ల కోసం మార్కెట్లపైనే ఆధారపడకుండా ఇంటి ఆవరణలోనే పండ్ల మొక్కలను పెంచుకోవడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సీతక్క సూచించారు.
మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు స్వచ్ఛమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.
జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి మొక్కలను ఇళ్ల వద్ద పెంచుకోవడం ద్వారా స్వచ్ఛమైన గాలితో పాటు పోషకాహారం కూడా లభిస్తుందని తెలిపారు.
పంపిణీ చేసిన మొక్కలు వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి మొక్కను ఇంటి సభ్యుడిలా ప్రేమగా పెంచుకుంటూ పచ్చని గ్రామాలకు, ఆరోగ్యకరమైన సమాజానికి ప్రజలంతా బలమైన పునాది వేయాలని మంత్రి సీతక్క కోరారు.

# సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ

హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:

తెలంగాణ శాసనసభ, శాసన మండలి వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ఉభయ సభల సమావేశాలు ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ చేశారు.
సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని అధికారులు సభ్యులకు సమాచారం అందించారు.

**సీఎం ముందే ప్రకటన**

వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ కార్యదర్శి సమావేశాల ప్రారంభ తేదీని అధికారికంగా వెల్లడించారు.

**బీఆర్ఎస్ పాలనపై చర్చకు సవాల్**

గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.
ఈ చర్చలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

**పలు అంశాలపై చర్చ**

ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలు సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది.
రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, వివిధ సామాజిక అంశాల నేపథ్యంలో సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలు కీలకంగా మారనున్నాయి.
సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడిగా చర్చలు జరిగే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో రేవంత్

మొదటిపేజీ తరువాయి

వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు క్షుద్ర పూజలు చేయిస్తున్నారంటూ చేసిన ఆరోపణలు, సొంత పార్టీ నేతలపైనే తీవ్రంగా వ్యవహరిస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.
ఇలాంటి వ్యాఖ్యలు ప్రసంగ వేదికలకే పరిమితం కాకుండా టీవీ చర్చలు, యూట్యూబ్ వీడియోలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. దీంతో ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి తనదైన రీతిలో సమాధానం ఇవ్వడమే కాకుండా, ప్రజల్లో రాజకీయ చర్చను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**గ్రామీణ ప్రాంతాలపై దృష్టి**

బీఆర్ఎస్ డిజిటల్ ప్రచారం పట్టణ ప్రాంతాలు, యువత, విద్యావంతులైన ఓటర్లలో ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ.. తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో నాయకుడి ప్రత్యక్ష హాజరు, స్థానిక కార్యకర్తలతో అనుసంధానం, ప్రజలతో ముఖాముఖి సంబంధాలు ఇప్పటికీ కీలకంగా ఉన్నాయి. రేవంత్ రెడ్డి

**ఆన్‌స్క్రీన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో కాంగ్రెస్**

ప్రస్తుతం తెలంగాణలో ప్రచార పోరును చూస్తే బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల్లో దూకుడుగా వ్యవహరిస్తుండగా.. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దీర్ఘకాలంలో కాంగ్రెస్ కేవలం ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆధారపడకుండా తన డిజిటల్ వ్యవస్థను కూడా బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.
ఎన్నికల రాజకీయాల్లో సామాజిక మాధ్యమాల ప్రచారం వేగంగా ప్రభావం చూపించినా.. ప్రజలను నేరుగా కలుసుకోవడం, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, క్షేత్రస్థాయిలో రాజకీయ సంబంధాలను బలోపేతం చేయడం దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అంశాలుగా నిలుస్తాయి. దీంతో ప్రస్తుతానికి బీఆర్ఎస్ డిజిటల్ దాడికి దీటుగా రేవంత్ రెడ్డి తన ప్రత్యక్ష రాజకీయ దూకుడును అస్త్రంగా మలుచుకుంటున్నారని చెప్పవచ్చు.

ఇదే అంశాన్ని తన రాజకీయ వ్యూహంలో ప్రధానంగా మలుచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలకు వెళ్లి సభల్లో మాట్లాడటం, స్థానిక సమస్యలను ప్రస్తావించడం, ప్రతిపక్షంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతో పాటు ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం జరుగుతోంది.

**వ్యూహంలో ముప్పులూ ఉన్నాయి**

అయితే రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఘాటు వ్యాఖ్యల వ్యూహానికి ప్రతికూలతలు కూడా లేకపోలేదు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన చర్చగా మారితే.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పనితీరు వంటి అసలు అంశాలు వెనుకబడే అవకాశం ఉంది. మరోవైపు రేవంత్ ప్రసంగాల్లోని వివాదాస్పద వ్యాఖ్యలను బీఆర్ఎస్ డిజిటల్ బృందం చిన్న వీడియోలుగా మార్చి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తోంది.

# రియల్‌ఎస్టేట్ సంస్థగా కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

**రూ.500 కోట్ల భూమి రూ.87 కోట్లకే**

హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని అజామాబాద్‌లో ఆయిల్‌ఫెడ్ సంస్థకు చెందిన 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని హరీశ్ రావు తెలిపారు.
15,984 గజాల విస్తీర్ణంలోని ఈ భూమి బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.500 కోట్ల విలువ చేస్తుందని పేర్కొన్నారు.
అలాంటి విలువైన భూమిని కేవలం రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు. రూ.87 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నప్పటికీ, దానిని పక్కనబెట్టి ప్రైవేటు వ్యక్తికి భూమిని కట్టబెట్టడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**సుప్రీంకోర్టు తీర్పును విస్మరణ**

1987లో ప్రైవేటు సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు గుర్తుచేశారు.
ఆ భూమిపై పూర్తి హక్కు ప్రభుత్వానిదేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎలాంటి ప్రైవేటు శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడామని పేర్కొన్నారు.
ఒకవైపు సామాన్యుల ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మరోవైపు కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలి, అజామాబాద్‌లోని ఖరీదైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు.

**నిర్ణయం వెనక్కి తీసుకోవాలి**

స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తులను ఇలాగే విక్రయిస్తూ పోతే భవిష్యత్తులో బడికి, గుడికి, చివరకు స్మశానానికి కూడా స్థలం మిగలదని హరీశ్ రావు హెచ్చరించారు.
అజామాబాద్ భూముల కేటాయింపును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూమికి సంబంధించిన పూర్తి ఫ్రీహోల్డ్ హక్కులను ఆయిల్‌ఫెడ్‌కే కల్పించాలని కోరారు. ప్రజల సొత్తును ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు న్యాయపోరాటంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ మహా పోరాటం చేస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

# నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం



**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:**
నేపాల్‌లో సంభవించిన వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణకు చెందిన వారి ఆచూకీ, సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు అంశాలపై తెలంగాణ భవన్ అధికారులు నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

**భారతీయుల తరలింపు**
భారత విదేశాంగ శాఖ అధికారుల వివరాల ప్రకారం ఆగస్టు 29న టిబెట్ నుంచి నేపాల్‌కు 449 మంది భారతీయులు చేరుకున్నారు. ఆగస్టు 30న మరో 397 మందిని అదే మార్గంలో తరలించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ పేరు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయన పాస్‌పోర్టు వివరాలు తెలంగాణ భవన్ వద్ద ఉన్న రికార్డులతో సరిపోలాయి. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నారని, ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదు**
నేపాల్ ప్రభుత్వం మృతుల ఛాయాచిత్రాలు, ప్రాథమిక వివరాలను నేపాల్ పోలీసుల డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా, తనహున్, నావల్పరాసీ తూర్పు, నావల్పరాసీ పశ్చిమ, ఖాఠ్మాండూ జిల్లాల్లో భద్రపరిచిన పార్థివదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.

కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా గుర్తించగలిగితే డీఎన్ఏ పరీక్ష తప్పనిసరి కాదని నేపాల్ పోలీసులు తెలిపారు. మృతుడితో బంధుత్వాన్ని నిర్ధారించే ఆధారాలను పరిశీలించిన అనంతరం పార్థివదేహాన్ని సంబంధిత కుటుంబానికి అప్పగించనున్నారు. ప్రత్యక్ష గుర్తింపు సాధ్యం కాని సందర్భాల్లో తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు వంటి తొలి స్థాయి బంధువుల డీఎన్ఏ ప్రొఫైల్‌ను సరిపోల్చనున్నారు. ఇందుకోసం బంధువులు నేపాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. స్వస్థలంలో సిద్ధం చేసిన డీఎన్ఏ ప్రొఫైల్‌ను సమర్పించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన ఈమెయిల్ విధానాన్ని నేపాల్ పోలీసులు రూపొందిస్తున్నారు.

**అధికారిక నిర్ధారణ తర్వాతే సమాచారం**
పార్థివదేహాల గుర్తింపు, కుటుంబాలకు అప్పగింత, స్వదేశానికి తరలింపునకు సంబంధించిన పూర్తి విధివిధానాలను నేపాల్ అధికారులు ఖరారు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులు స్వయంగా నేపాల్‌కు వెళ్లకుండా తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయంతో సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రతి కేసులో అధికారిక నిర్ధారణ పూర్తయిన తర్వాతే సంబంధిత కుటుంబాలకు, ప్రజలకు తదుపరి సమాచారం అందిస్తామని అధికారులు వెల్లడించారు.

# NEET-PGలో 15 శాతం AIQ చేయాలి

- **50 శాతం ఆల్ ఇండియా కోటాను తగ్గించాలని వినోద్ కుమార్ లేఖ**
- **తెలంగాణలో పెరిగిన ప్రభుత్వ వైద్య కళాశాలలు, పీజీ సీట్లు**
- **రాష్ట్ర నిధులతో ఏర్పాటైన సీట్లలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్**
- **AIQ కింద రాష్ట్రాల వారీగా పారదర్శక గణాంకాలు విడుదల చేయాలి**
- **సమతుల్య సమాఖ్య విధానం అవసరమని కేంద్రానికి సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:**
NEETPGలో ప్రస్తుతం అమల్లో ఉన్న 50 శాతం ఆల్ ఇండియా కోటా (AIQ)ను 15 శాతానికి తగ్గించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. దేశవ్యాప్తంగా జరిగిన NEETPG పరీక్ష సందర్భంగా తెలంగాణ వైద్య విద్యార్థులు, వైద్యుల నుంచి అందిన సమాచారం, వారి ఆందోళనల నేపథ్యంలో ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.

**రాష్ట్ర నిధులతో వైద్య విద్య**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జిల్లాల వారీగా పలు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిందని వినోద్ కుమార్ తెలిపారు. వైద్య విద్యతో పాటు పీజీ సీట్ల సంఖ్యను కూడా గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. ఈ వైద్య కళాశాలలు, సీట్ల ఏర్పాటుకు రాష్ట్ర



ప్రజల నిధులు, ప్రభుత్వ వనరులు వినియోగిస్తున్నందున వాటిలో అధిక భాగం తెలంగాణ వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండేలా విధానం రూపొందించాలని కోరారు.

**AIQలో సమతుల్యత అవసరం**
NEETUGలో 15 శాతం AIQ అమల్లో ఉండగా, NEETPGలో 50 శాతం AIQ కొనసాగడం సమతుల్యంగా లేదని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. పీజీ వైద్య విద్యలోనూ AIQను 15 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రిని కోరారు.

**రాష్ట్రాల వారీగా గణాంకాలు**
ప్రతి రాష్ట్రం నుంచి AIQకు ఎన్ని ప్రభుత్వ పీజీ సీట్లు వెళ్తున్నాయి, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంతమంది విద్యార్థులు ఆయా సీట్లను పొందుతున్నారనే వివరాలను రాష్ట్రాల వారీగా పారదర్శకంగా వెల్లడించాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రస్తుత AIQ విధానంపై సమగ్ర సమీక్ష నిర్వహించి, రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేయాలని కోరారు.

**సమాఖ్య విధానం అవసరం**
ఈ డిమాండ్ తెలంగాణకు మాత్రమే పరిమితం కాదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రాలు తమ ప్రజా నిధులతో అభివృద్ధి చేస్తున్న వైద్య విద్యా మౌలిక వసతులకు అనుగుణంగా పీజీ సీట్లలో రాష్ట్ర విద్యార్థులకు సముచిత వాటా లభించేలా సమతుల్యమైన సమాఖ్య విధానం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

# భారత వైద్య వ్యవస్థపై విదేశీ అనుభవంతో డాక్టర్ ప్రశంసలు


- **బ్రిటన్‌తో పోల్చిన వైద్యురాలి వీడియో వైరల్**
- **అర్ధరాత్రి కూడా మందులు సులభంగా లభించడంపై ప్రస్తావన**
- **వైద్య సేవల్లో భారత్‌కు ఉన్న సౌలభ్యాన్ని వివరించిన డాక్టర్**
- **భారత వైద్య వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ**
- **వీడియోపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న నెటిజన్లు**

**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:**
భారత్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో వైద్య సేవల లభ్యతను పోలుస్తూ భారతీయ వైద్యురాలు డాక్టర్ దీపాంజలి శర్మ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాత్రివేళ తన భర్తకు అకస్మాత్తుగా అనారోగ్యం రావడంతో మందులు, ఐవీ ఇంజెక్షన్ల కోసం బయటకు వెళ్లిన ఆమె.. ఆ సమయంలో భారత్‌లో ఉండటం ఎంత సౌకర్యంగా ఉందో వివరించారు.

**రాత్రి వేళ మందుల కోసం బయటకు**
డాక్టర్ శర్మ భర్త కూడా వైద్యుడే. ఆయనకు తొలుత తలనొప్పి రావడంతోపాటు వరుసగా వాంతులు కావడంతో ఆమె రాత్రి 10 గంటల సమయంలో మందుల కోసం బయటకు వెళ్లారు. అవసరమైన మందులు, ఐవీ ఇంజెక్షన్లు తీసుకుని తిరిగి ఇంటికి చేరుకునే అవకాశం భారత్‌లో ఉండటం తనకు గొప్ప విషయంగా అనిపించిందని ఆమె పేర్కొన్నారు.

**పాశ్చాత్య దేశాల్లో భిన్న పరిస్థితులు**
బ్రిటన్‌తో పాటు ఇతర పాశ్చాత్య దేశాల్లో సాధారణ పని వేళలు దాటిన తర్వాత అత్యవసర వైద్య సహాయం, కొన్ని మందులు పొందడం కష్టంగా ఉంటుందని డాక్టర్ శర్మ తెలిపారు. అత్యవసర విభాగాల్లో ఇప్పటికే రద్దీ, ఒత్తిడి ఉండటంతో వెంటనే వైద్య సహాయం అందడం కష్టమయ్యే అవకాశం ఉందన్నారు. మందులు కూడా వెంటనే లభించకపోవచ్చని చెప్పారు.

**భారత్‌లో సౌలభ్యమే బలమని వ్యాఖ్య**
భారత్‌లో అర్ధరాత్రి అయినా బయటకు వెళ్లి అవసరమైన మందులు తీసుకొచ్చి, తిరిగి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యుడిని చూసుకునే అవకాశం ఉండటాన్ని ఆమె ప్రస్తావించారు. 24



గంటల ఫార్మసీలు, అందుబాటులో ఉండే వైద్య సేవలు భారత వైద్య వ్యవస్థకు ఉన్న సౌలభ్యాన్ని చూపుతున్నాయని చెప్పారు.

**లోపాలు లేవని చెప్పడం లేదని స్పష్టీకరణ**
భారత వైద్య వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేవని తాను చెప్పడం లేదని డాక్టర్ శర్మ స్పష్టం చేశారు. ఇంకా మెరుగుపరచాల్సిన అంశాలు ఉన్నాయని, ఏ దేశంలోనూ వైద్య సేవలు పూర్తిగా పరిపూర్ణంగా ఉండవని పేర్కొన్నారు. అయితే భారత్‌లో సాధారణ ప్రజలకు వైద్య సేవలు, మందులు సులభంగా అందుబాటులో ఉండటం ఒక ప్రత్యేకతగా అభిప్రాయపడ్డారు.

**నెటిజన్ల నుంచి భిన్న స్పందనలు**
డాక్టర్ శర్మ వీడియోపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. భారత్‌లో 24 గంటల ఫార్మసీలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మందులు త్వరగా పొందగలుగుతున్నామని పలువురు పేర్కొన్నారు. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే కొన్ని మందులు సులభంగా లభించడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఇక క్రాస్ వాల్యుయేషన్

**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:**
తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై విద్యార్థుల జవాబు పత్రాలను అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కాకుండా ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించే క్రాస్ వాల్యుయేషన్ విధానాన్ని అమలు చేయనున్నారు.

**నిష్పక్షపాత మూల్యాంకనం**
1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే SA1, SA2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు 10వ తరగతి SA1 పరీక్ష పేపర్లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు దిద్దరు. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు వాటిని అప్పగించి మూల్యాంకనం చేయిస్తారు.

తమ వద్ద చదివే విద్యార్థుల జవాబు పత్రాలను



ఉపాధ్యాయులు దిద్దే సమయంలో మార్కుల కేటాయింపులో హెచ్చుతగ్గులు జరిగే అవకాశం ఉంటుంది. క్రాస్ వాల్యుయేషన్ ద్వారా ఇలాంటి పక్షపాతానికి అడ్డుకట్ట వేసి, సమాధానాల ఆధారంగా ప్రామాణిక మార్కులు కేటాయించే అవకాశం ఉంటుంది.

**మండల కేంద్రాల్లో కేంద్రాలు**
క్రాస్ వాల్యుయేషన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఈ కేంద్రాలు పనిచేస్తాయి. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను మూల్యాంకన విధులకు కేటాయించి జవాబు పత్రాల దిద్దుబాటు ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

**విద్యా సామర్థ్యంపై స్పష్టత**
నిష్పక్షపాతంగా వెలువడే ఫలితాల ద్వారా ప్రతి విద్యార్థి అసలైన విద్యా సామర్థ్యాన్ని గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ఏయే అంశాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో స్పష్టంగా తెలుసుకోవచ్చు.

ఈ ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన, రెమెడియల్ తరగతులు నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు క్రాస్ వాల్యుయేషన్ విధానం దోహదపడుతుందని విద్యాశాఖ భావిస్తోంది.




# తెలంగాణలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సన్నాహా

**హైదరాబాద్, ఆగస్టు 30, సిరి న్యూస్:**
గోదావరి పుష్కరాలు అంటే రాజమహేంద్రవరం పేరు గుర్తుకొచ్చే పరిస్థితిని మార్చి, ఇకపై తెలంగాణతో గోదావరి పుష్కరాలకు ప్రత్యేక అనుబంధం ఏర్పడేలా వచ్చే ఏడాది ఉత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ‘గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు’ అనేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

**రూ.1,000 కోట్లతో ఏర్పాట్లు**
2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా**
పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు పరిచయమయ్యేలా వసతులు కల్పించాలని సురేఖ సూచించారు. పుష్కర ఘాట్లు, భక్తుల రాకపోకలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని చెప్పారు.

**సమన్వయానికి ప్రత్యేక కార్యాలయం**
గోదావరి పుష్కరాలు 2027 పనుల సమన్వయం కోసం ప్రజాభవన్‌లోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ఈ కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.




# నీట్ పీజీ పరీక్షలో కలకలం

- **సెక్యూరిటీ దాటుకుని మద్యం మత్తులో హాజరు**
- **పరీక్ష హాల్‌లో విద్యార్థి తీరుపై సిబ్బందికి అనుమానం**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30, సిరి న్యూస్:**
తెలంగాణలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిన వేళ రంగారెడ్డి జిల్లాలో ఓ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష రాసేందుకు రావడం కలకలం రేపింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని పరీక్ష కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్ మద్యం సేవించి పరీక్షకు హాజరైనట్లు గుర్తించారు.

**సెక్యూరిటీ దాటుకుని పరీక్ష హాల్‌లోకి**
రిజ్వాన్ సాధారణ తనిఖీలను దాటుకుని పరీక్ష హాల్‌లో తన సీటు వరకు వెళ్లాడు. అయితే అతడి ప్రవర్తనలో తేడా కనిపించడంతోపాటు మద్యం వాసన రావడంతో పరీక్ష సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో అతడిని వెంటనే బయటకు పంపి మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష**
మరోసారి నిర్వహించిన తనిఖీలో రిజ్వాన్ మద్యం సేవించి వచ్చినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహించారు. మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సెక్యూరిటీపై ప్రశ్నలు**
నీట్ పీజీ వంటి కీలక పరీక్షకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష హాల్ వరకు చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే ముందు తనిఖీల తీరుపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# నార్త్ సైప్రస్ తీరంలో ఫెర్రీ బోల్తా


- **వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు**
- **ప్రయాణికుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు**
- **ప్రాణనష్టంపై ఇంకా అధికారిక సమాచారం లేదు**

**కైరేనియా, ఆగస్టు 30, సిరి న్యూస్:**
నార్త్ సైప్రస్ తీరంలో ఆదివారం సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫెర్రీ సముద్రంలో బోల్తాపడింది. నౌకలోకి ఒక్కసారిగా నీరు చేరడంతో ప్రమాదం జరిగినట్లు టర్కిష్ సైప్రియట్, టర్కీ మీడియా సంస్థలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సెర్చ్ అండ్ రెస్క్యూ చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు ప్రాణనష్టం జరిగినట్లు అధికారిక సమాచారం లేదు.

**మార్గమధ్యంలో నీరు చేరడంతో**
కాటమరాన్ తరహా ఫెర్రీ నార్త్ సైప్రస్‌లోని కైరేనియా పోర్టు నుంచి టర్కీలోని మెర్సిన్ ప్రావిన్స్‌లోని తసూకు పోర్టుకు బయలుదేరింది. తీరానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉండగా నౌకలోకి నీరు చేరడం ప్రారంభమైంది. దీంతో కొద్దిసేపటికే ఫెర్రీ అదుపుతప్పి సముద్రంలో బోల్తాపడినట్లు టర్కీ ప్రభుత్వ ప్రసార సంస్థ తెలిపింది.

**మంత్రి ధ్రువీకరణ**
ఫెర్రీ ప్రమాదానికి గురైన విషయాన్ని నార్త్ సైప్రస్ రవాణా మంత్రి ఎర్హాన్ అరిక్లీ ధ్రువీకరించారు. ప్రమాద ప్రాంతానికి సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**
ప్రమాదం అనంతరం ప్రయాణికులను గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు అధికారులు గాలింపు, సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంతమందిని రక్షించారు, ప్రయాణికుల పరిస్థితి ఏమిటన్న వివరాలను అధికారులు వెల్లడించలేదు.



# కెర్మెడెక్ దీవుల సమీపంలో భూకంపం

- రిక్టర్ స్కేలుపై 5.8 తీవ్రతగా నమోదు
- సముద్రంలోనే భూకంప కేంద్రం
- న్యూజిలాండ్ ప్రాంతంలో ప్రకంపనలు
- సునామీ హెచ్చరికలు లేవు

**కెర్మెడెక్ దీవులు, ఆగస్టు 30, సిరి న్యూస్:**

న్యూజిలాండ్‌కు సమీపంలోని కెర్మెడెక్ దీవుల ప్రాంతంలో ఆదివారం భూకంపం సంభవించింది. సముద్రంలో చోటుచేసుకున్న ఈ ప్రకంపనల తీవ్రత 5.8గా నమోదైనట్లు తాజా భూకంప వివరాలు వెల్లడించాయి.

**సముద్ర గర్భంలో ప్రకంపనలు**

కెర్మెడెక్ దీవుల పరిసర ప్రాంతం భూకంప కార్యకలాపాలకు పేరుగాంచింది. తాజా ప్రకంపనలతో ఆ ప్రాంతంలో మరోసారి భూకంపం నమోదైంది. గతంలోనూ ఇక్కడ బలమైన భూకంపాలు సంభవించాయి.

**సునామీ ముప్పు లేదు**

భూకంపం సముద్ర ప్రాంతంలో సంభవించినప్పటికీ ప్రస్తుతానికి సునామీ ముప్పుపై ఎలాంటి హెచ్చరికలు వెలువడినట్లు తాజా సమాచారం లేదు.




# దేశమంతా ఇక ఒకే సమయం

- మార్చి 2027 నుంచి IST తప్పనిసరి
- చట్టపరమైన, వాణిజ్య, డిజిటల్ వ్యవహారాలకు వర్తింపు
- ఆర్థిక లావాదేవీలు, టెలికాం, రవాణాపైనా ప్రభావం
- సైబర్ దాడుల నుంచి సమయ వ్యవస్థలకు రక్షణ
- ఉల్లంఘనలకు జరిమానా విధించే అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 30, సిరి న్యూస్:**

దేశంలో సమయ వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027 మార్చి నుంచి అన్ని సంస్థలు చట్టపరమైన, వాణిజ్య, డిజిటల్, పరిపాలనా అవసరాలకు భారత ప్రామాణిక సమయం (ఐఎస్‌టీ)నే తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ (ఇండియన్ స్టాండర్డ్ టైమ్) రూల్స్, 2026ను కేంద్రం ప్రకటించింది. గెజిట్ నోటిఫికేషన్ ప్రచురితమైన 180 రోజుల తర్వాత నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

**అధికారిక వ్యవహారాల్లో ఐఎస్‌టీ**

కొత్త నిబంధనల ప్రకారం ప్రత్యేక మినహాయింపు ఉన్న సందర్భాలు మినహా చట్టపరమైన, పరిపాలనా, అధికారిక పత్రాలు, రికార్డుల్లో ఐఎస్‌టీనే సమయ ప్రమాణంగా ఉపయోగించాలి. వాణిజ్యం, రవాణా, ప్రభుత్వ పరిపాలన, చట్టపరమైన ఒప్పందాలు, ఆర్థిక లావాదేవీల్లోనూ ఇదే ప్రమాణాన్ని అనుసరించాలి.

**కొన్ని రంగాలకు మినహాయింపు**

విదేశీ సమయ మండలిని స్పష్టంగా పేర్కొనాల్సిన సందర్భాల్లో ఇతర సమయ ప్రమాణాలను ఉపయోగించేందుకు అవకాశం ఉంటుంది. శాస్త్రీయ పరిశోధనలు, నావిగేషన్, ఖగోళ శాస్త్ర కార్యకలాపాలు, ప్రభుత్వం ప్రత్యేకంగా అనుమతించిన సందర్భాలకు కూడా మినహాయింపులు వర్తిస్తాయి.

**డిజిటల్ వ్యవస్థలపై దృష్టి**

డిజిటల్ చెల్లింపులు, స్టాక్ మార్కెట్లు, టెలికాం నెట్‌వర్క్‌లు, 5జీ సేవలు, నావిగేషన్, విద్యుత్ గ్రిడ్‌లు, డేటా కేంద్రాలు వంటి కీలక వ్యవస్థలు అత్యంత ఖచ్చితమైన సమయ సమకాలీకరణపై ఆధారపడి పని చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఒకే సమయ ప్రమాణం అమలు చేయడం ద్వారా లావాదేవీల నమోదు, వ్యవస్థల మధ్య సమన్వయం, నెట్‌వర్క్‌ల విశ్వసనీయత మెరుగుపడుతుందని కేంద్రం భావిస్తోంది.

**సైబర్ భద్రతకు ప్రాధాన్యం**

సమయ సమకాలీకరణ వ్యవస్థలను సురక్షితంగా నిర్వహించడంతోపాటు స్పూఫింగ్, జామింగ్ వంటి సైబర్ దాడుల నుంచి వాటిని రక్షించాల్సి ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ అధీకృత సమయ వనరులను ఉపయోగించడం, సమయ వ్యవస్థ విఫలమైనప్పుడు పనిచేసే ప్రత్యామ్నాయ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి చర్యలకు నిబంధనలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అవసరమైన చోట అటామిక్ క్లాక్‌ల వంటి అత్యంత ఖచ్చితమైన సమయ వనరులను వినియోగించాల్సి ఉంటుంది.

**సంస్థలకు ముందస్తు సన్నద్ధత**

దేశవ్యాప్తంగా సమయానికి ఒకే ప్రమాణాన్ని ఏర్పాటు చేయడమే కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, టెలికాం, రవాణా, ప్రభుత్వ సేవలు, ఆర్థిక మార్కెట్లలో సమయ వ్యత్యాసాల వల్ల తలెత్తే సమస్యలను తగ్గించేందుకు ఇది దోహదపడనుంది. నిబంధనలు అమల్లోకి రావడానికి 180 రోజుల గడువు ఉండటంతో సంస్థలు తమ డిజిటల్, సాంకేతిక వ్యవస్థలను ఐఎస్‌టీకి అనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత చట్టం ప్రకారం జరిమానాలు విధించే అవకాశం ఉంది.




# మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

**తాష్కెంట్, ఆగస్టు 30, సిరి న్యూస్:**

ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత రాష్ట్ర పురస్కారం లభించింది. అధ్యక్షుడు శావ్కత్ మిర్జియోయెవ్ 'ఓలియ్ డారాజలి డోస్ట్ లిక్' పతకాన్ని మోదీకి ప్రదానం చేశారు. ప్రధానికి దక్కిన 36వ అంతర్జాతీయ పురస్కారం ఇదేనని సమాచారం.

**భారత్–ఉజ్బెకిస్థాన్ బంధానికి అంకితం**

పురస్కారం స్వీకరించడం గర్వంగా ఉందని మోదీ తెలిపారు. ఈ గౌరవాన్ని భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య శాశ్వత స్నేహ బంధానికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. భారతీయులకు సుపరిచితమైన 'దోస్త్' పదం మాదిరిగానే 'డోస్ట్ లిక్' అంటే స్నేహం అని వివరించారు.

**పలు దేశాల అత్యున్నత పురస్కారాలు**

ఈ ఏడాది జూలైలో ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపూర్ణ'ను మోదీ అందుకున్నారు. జూన్‌లో సీషెల్స్ నుంచి పర్యావరణం, స్థిరమైన అభివృద్ధికి కృషికి 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' అవార్డు, స్లొవేకియా అత్యున్నత రాష్ట్ర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్' లభించాయి.


**ఘనా, నార్వే, స్వీడన్, ఇజ్రాయెల్ గౌరవాలు**

ఇవే కాకుండా ఈ ఏడాది ఘనా, నార్వే, స్వీడన్, ఇజ్రాయెల్ దేశాలు కూడా మోదీకి తమ అత్యున్నత పౌర, రాష్ట్ర పురస్కారాలను అందించాయి. తనకు లభిస్తున్న ఈ గౌరవాలు వ్యక్తిగతమైనవి కావని, 140 కోట్ల మంది భారతీయులకు దక్కుతున్న గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు.



# ఎఫ్‌డీఏకు బాంబే హైకోర్టు షాక్

- సిప్లా లైసెన్స్ రద్దుపై తీవ్ర అభ్యంతరం
- ఎంసీఏ రెస్టారెంట్ల మూసివేతపైనా ప్రశ్నలు
- చట్టాన్ని సరిగ్గా విశ్లేషించలేదని ఆగ్రహం
- అధికారుల తీరు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వ్యాఖ్య
- కోర్టు హెచ్చరికలతో వెనక్కి తగ్గిన ఎఫ్‌డీఏ




**ముంబై, ఆగస్టు 30, సిరి న్యూస్:**

మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ)కు బాంబే హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సిప్లా ఫార్మా సంస్థకు చెందిన పుణె యూనిట్ డ్రగ్ సేల్ లైసెన్స్ రద్దు, ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ప్రాంగణంలోని ఐదు రెస్టారెంట్ల లైసెన్స్‌ల సస్పెన్షన్‌పై కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చట్టాన్ని పూర్తిగా పరిశీలించకుండా తొందరపాటుతో నిర్ణయాలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేసింది.

**సిప్లా లైసెన్స్ రద్దుపై ఆగ్రహం**

సిప్లా యూనిట్ లైసెన్స్ రద్దుకు ముందు అనుసరించాల్సిన విధానాన్ని ఎఫ్‌డీఏ పాటించలేదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ సెలవు రోజున కంపెనీ ప్రతినిధిని విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ ఈమెయిల్ పంపడంపైనా అభ్యంతరం తెలిపింది. ఎఫ్‌డీఏ వ్యవహరించిన తీరు 'హైహ్యాండెడ్'గా ఉందని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా లైసెన్స్ రద్దు ఉత్తర్వులు జారీ చేశారని వ్యాఖ్యానించింది. కోర్టు అభ్యంతరాల నేపథ్యంలో సిప్లా యూనిట్ లైసెన్స్ రద్దు ఉత్తర్వును ఎఫ్‌డీఏ వెనక్కి తీసుకుంది.

**ఎంసీఏ రెస్టారెంట్లపై చర్యకు ప్రశ్నలు**

బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లోని ఎంసీఏ ప్రాంగణంలో ఉన్న ఐదు రెస్టారెంట్ల కార్యకలాపాలను ఎఫ్‌డీఏ నిలిపివేసింది. అయితే తాజా తనిఖీల్లో ఆయా రెస్టారెంట్లు 88 శాతం మేర ఆహార భద్రతా నిబంధనలను పాటిస్తున్నట్లు తేలిందని కోర్టు దృష్టికి వచ్చింది. అయినప్పటికీ లైసెన్స్‌లు సస్పెండ్ చేయడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

**ఒప్పందంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశం**

రెస్టారెంట్ల లైసెన్స్‌లు ఎంసీఏ పేరుతో ఉండగా.. వాటిని ఎంసీఏతో ఒప్పందం చేసుకున్న శిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్వహిస్తోంది. ఇదే కారణంతో ఎఫ్‌డీఏ లైసెన్స్‌లను సస్పెండ్ చేసింది. అయితే ఒక సంస్థ పేరుతో లైసెన్స్ ఉండి, మరో సంస్థ అదే ప్రాంగణంలో కార్యకలాపాలు నిర్వహించడాన్ని నిషేధించే నిబంధన చట్టంలో లేదని కోర్టు అభిప్రాయపడింది.

**'చట్టాన్ని అర్థం చేసుకుని వ్యవహరించండి'**

చట్టాన్ని అక్షరాలా పట్టుకుని ఆచరణాత్మక దృక్పథాన్ని పక్కన పెట్టొద్దని గత విచారణలోనే ఎఫ్‌డీఏ అధికారులకు కోర్టు సూచించింది. అయినప్పటికీ అధికారులు తమ ఆదేశాలను పట్టించుకోలేదని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే వైఖరి కొనసాగితే ధిక్కరణ చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించింది. అవసరమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ, 'మీరు లార్డ్ అనుకుంటున్నారా? ఏదైనా చేయొచ్చని భావిస్తున్నారా?' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

**రెస్టారెంట్లకు కార్యకలాపాలకు అనుమతి**

కోర్టు హెచ్చరికల నేపథ్యంలో ఎంసీఏకు కొత్త నోటీసు జారీ చేసి, ఎంసీఏ-శిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మధ్య ఒప్పందంపై వారి వాదనను వినేందుకు ఎఫ్‌డీఏ అంగీకరించింది. అనంతరం కారణాలతో కూడిన తాజా ఉత్తర్వు జారీ చేస్తామని తెలిపింది. ప్రస్తుతం రెస్టారెంట్లు ఆహార భద్రతా నిబంధనలను పాటిస్తున్నందున వాటి లైసెన్స్ సస్పెన్షన్ ఉత్తర్వు రద్దయినట్లేనని కోర్టు స్పష్టం చేసింది. దీంతో రెస్టారెంట్లు తిరిగి కార్యకలాపాలు ప్రారంభించుకోవచ్చని తెలిపింది. సిప్లా కేసులో ప్యాకేజింగ్, రియాక్టిన్ ఫ్లస్ మాత్రల రీకాల్‌కు సంబంధించిన ఫాలోఅప్ తనిఖీల్లో ఉల్లంఘనలు గుర్తించామని ఎఫ్‌డీఏ తెలిపింది. ఈ కారణంగా పుణెలోని వాడ్కి ప్రాంతంలోని సిప్లా క్యారీయింగ్ అండ్ ఫార్వార్డింగ్ కేంద్రానికి సంబంధించిన డ్రగ్ సేల్ లైసెన్స్‌లను ఆగస్టు 27 నుంచి రద్దు చేసింది. అయితే హైకోర్టు తీవ్ర అభ్యంతరాల నేపథ్యంలో ఆ చర్యను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.

# బిలావల్ భుట్టో పెళ్లి ప్రచారంపై క్లారిటీ

- యూరప్ రాజకుటుంబ యువతితో వివాహమంటూ ప్రచారం
- వార్తలు తప్పుడు, నిరాధారమన్న పీపీపీ నేత
- లిక్టెన్‌స్టెయిన్‌కు జర్దారీ వెళ్లినట్లు సోషల్ మీడియాలో కథనాలు

**కరాచీ, ఆగస్టు 30, సిరి న్యూస్:**

పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చైర్మన్, మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ త్వరలో యూరప్‌కు చెందిన రాజకుటుంబ సభ్యురాలిని వివాహం చేసుకోబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని పీపీపీ నేత, కరాచీ మేయర్ ముర్తజా వహాబ్ ఖండించారు. బిలావల్ నిశ్చితార్థం, వివాహానికి సంబంధించిన వార్తలు తప్పుడు, నిరాధారమైనవని స్పష్టం చేశారు.

**రాజకుటుంబ యువతితో పెళ్లంటూ ప్రచారం**

38 ఏళ్ల బిలావల్.. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ కుమారుడు. ఇటీవల ఆయన వివాహానికి సంబంధించిన పలు పోస్టులు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. జర్దారీ తన కుమారుడి వివాహ తేదీ ఖరారు చేసేందుకు లిక్టెన్‌స్టెయిన్ వెళ్లినట్లు కొన్ని పోస్టుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా బిలావల్ వివాహం చేసుకోబోతున్న యువతి 26 ఏళ్ల మాజీ ఆస్ట్రియన్ ఆర్చ్‌డచెస్ గ్లోరియా వాన్ హ్యాబ్స్‌బర్గ్ అంటూ ప్రచారం సాగింది.

**హ్యాబ్స్‌బర్గ్ వంశానికి చెందిన యువతి**

గ్లోరియా వాన్ హ్యాబ్స్‌బర్గ్ ఆస్ట్రియా ఆర్చ్‌డ్యూక్ కార్ల్, ఫ్రాన్సెస్కా వాన్ థైసెన్‌బోర్నెమిస్జా కుమార్తెగా ప్రచారంలో ఉంది. హ్యాబ్స్‌బర్గ్‌లోరైన్ రాజవంశానికి చెందిన ఆమె.. ఆస్ట్రియా చివరి చక్రవర్తి, హంగేరీ చివరి రాజు కార్ల్ 1కి మునిమనవరాలిగా పేర్కొంటున్నారు. అయితే బిలావల్‌తో ఆమె వివాహం జరగబోతోందన్న ప్రచారానికి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు.

**పీపీపీ నేత ఖండన**

ఈ ప్రచారంపై ముర్తజా వహాబ్ శనివారం అర్ధరాత్రి ఎక్స్ వేదికగా స్పందించారు. బిలావల్ నిశ్చితార్థం, వివాహానికి సంబంధించిన వార్తలు 'తప్పుడు, నిరాధారమైనవి' అని పేర్కొన్నారు. మరోవైపు పాకిస్థాన్‌కు చెందిన ఉర్దూ దినపత్రిక డైలీ ఔసాఫ్ కూడా బిలావల్ వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు కథనం ప్రచురించింది. అయితే ఆ కథనాన్ని అనంతరం తొలగించింది.

**జర్దారీ పర్యటనపై వివరాలు గోప్యం**

ఆగస్టు 27న పాకిస్థాన్ అధ్యక్ష భవన్ ఎక్స్‌లో ఆసిఫ్ అలీ జర్దారీ ప్రైవేట్ పర్యటన కోసం విదేశాలకు వెళ్లినట్లు వెల్లడించింది. అయితే పర్యటన ఉద్దేశాన్ని మాత్రం ప్రకటించలేదు. ఈ పర్యటనకు బిలావల్ వివాహ ప్రచారానికి సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు లేవు. బిలావల్ లేదా ఆయన కుటుంబ సభ్యులు కూడా వివాహంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం వైరల్ అవుతున్న పెళ్లి వార్తలను నిరాధారమైనవిగానే పీపీపీ నేత కొట్టిపారేశారు.

# పాక్ గూఢచర్య నెట్‌వర్క్ గుట్టురట్టు

- లూథియానాలో 22 ఏళ్ల దుకాణదారుడి అరెస్ట్
- చైనా సీసీ కెమెరాలతో పాక్‌కు ప్రత్యక్ష ప్రసారం
- సైనిక కార్యకలాపాల సమాచారాన్ని చేరవేసినట్లు అనుమానం
- ఆయుధ డిపోకు సమీపంలో దుకాణం అద్దెకు తీసుకున్న నిందితుడు
- రూ.3 లక్షలు చెల్లించినట్లు విచారణలో వెల్లడి

**లూథియానా, ఆగస్టు 30, సిరి న్యూస్:**

పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి సంబంధించిన గూఢచర్య నెట్‌వర్క్‌ను పంజాబ్ పోలీసులు ఛేదించారు. పాకిస్థాన్ తరఫున గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న 22 ఏళ్ల రచ్పాల్ సింగ్‌ను లూథియానాలో అరెస్టు చేశారు. నగరానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**చైనా సీసీ కెమెరాలతో నిఘా**

లూథియానా-ఫిరోజ్‌పూర్ రోడ్డులో నిందితుడు షూ దుకాణాన్ని అద్దెకు తీసుకున్నాడు. దుకాణం బయట రోడ్డువైపు చూసేలా చైనాలో తయారైన రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాడు. వాటి ద్వారా పరిసరాల్లో జరుగుతున్న కార్యకలాపాలను పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లు ప్రత్యక్షంగా పరిశీలించేవారని పోలీసులు తెలిపారు.

**ఆయుధ డిపోకు సమీపంలో దుకాణం**

పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్ల ఆదేశాల మేరకే దుకాణాన్ని అద్దెకు తీసుకున్నట్లు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు కౌంటర్ ఇంటెలిజెన్స్ ఏఐజీ సిమ్రత్ పాల్ సింగ్ ధిండ్సా తెలిపారు. ఆ దుకాణం బధోవాల్ ఆయుధ డిపోకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు గుర్తించారు. నెలకు రూ.40 వేల అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**రూ.3 లక్షలు చెల్లించినట్లు సమాచారం**

గూఢచర్య కార్యకలాపాలకు పాక్ హ్యాండ్లర్లు నిందితుడికి సుమారు రూ.3 లక్షలు చెల్లించినట్లు విచారణలో వెల్లడైంది. దుకాణం పెద్దగా వ్యాపారం లేకపోయినా అద్దె చెల్లించడం, కెమెరాల దిశను తరచూ మార్చడం పోలీసులకు అనుమానం కలిగించింది. లూథియానాలో భారీ దాడికి పాకిస్థాన్ ఏజెన్సీలు పన్నిన కుట్రలో భాగంగానే ఈ నిఘా సాగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



**సంయుక్తంగా అరెస్ట్**

ఆగస్టు 27న అందిన సమాచారంతో లూథియానా కమిషనరేట్ పోలీసులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. రచ్పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. నెట్‌వర్క్‌లో మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.






# గంజాయి మత్తుకు యువత దూరంగా ఉండాలి

- **గంజాయికి బానిసైతే భవిష్యత్తు అంధకారమే**
- **యువత చెడు వ్యసనాలకు లోనుకావద్దు**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**గుమ్మడిదల, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ జన్మదినం సందర్భంగా ఆదివారం నిర్వహించిన జీపీఎల్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చైర్మన్ కుమార్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి మత్తుకు అలవాటు పడిన యువత జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కుటుంబ సభ్యులకు కూడా తీవ్ర మనోవేదన కలుగుతుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, ఉపాధి, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. యువత గంజాయికి అలవాటు పడుతున్నారనే విషయం తెలిస్తే గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తం కావాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. గంజాయికి ఒకసారి అలవాటైతే దాని నుంచి బయటపడటం అంత సులభం కాదని, అది వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. గంజాయికి బానిసైన యువతను చూసి ఊరుకునే పరిస్థితి ఉండదని, అలాంటి వ్యసనాలకు యువతను దూరంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. యువత తమ స్నేహితుల ప్రభావంతోనో, సరదా కోసమో మత్తు పదార్థాలను ప్రయత్నించవద్దని సూచించారు. ఒక్కసారి చూద్దాం అనే ఆలోచనే భవిష్యత్తులో పెద్ద సమస్యకు దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం చాలామంది యువత క్రీడలపై ఆసక్తి చూపకుండా సెల్‌ఫోన్లలో పాటలు, ఇతర వినోద కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని అన్నారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి మైదానంలో గడిపే సమయాన్ని పెంచుకోవాలని సూచించారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలో యువతకు క్రీడా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు అనువైన స్థలాన్ని గుర్తించి మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే క్రికెట్‌తో పాటు వివిధ క్రీడలకు యువతకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. యువత క్రీడల్లో రాణించి గుమ్మడిదలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, నాయకులు దేవేందర్ రెడ్డి, సూర్యనారాయణ, వెంకట్రామిరెడ్డి మద్ది శేఖర్ రెడ్డి, మహేష్, ఆంజనేయులు, నల్తూరి సాయి, దాసరి సాయి, కర్ణాకర్ గౌడ్, చిరుమని శ్రీనివాస్, మధు గౌడ్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు



# నల్ల పోచమ్మ తల్లి కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- **మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి**

**గుమ్మడిదల, ఆగస్టు 30( సిరి న్యూస్ ):**

పురపాలక సంఘం కేంద్రమైన జిన్నారం గ్రామంలో నిర్వహించిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం పొందారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నందున ఎల్‌నినో ప్రభావం తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. రైతులు సంతోషంగా ఉండేలా పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాల్లో సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, వెంకటేశం గౌడ్, దేవేందర్ రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# యువతకు అండగా కానిస్టేబుల్ సాయి కుమార్

- **నిపుణులతో ప్రశ్నాపత్రాలు తయారు చేయించి, పరీక్షల నిర్వహణ.**

**రామాయంపేట, ఆగస్టు 30 (సిరి న్యూస్)**

పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు అండగా నిలుస్తున్నారు మెదక్ ఎస్పీ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సాయికుమార్. ఉద్యోగార్థులకు ఉపయోగపడేలా తన సొంత ఖర్చులతో నిపుణులతో ప్రశ్నాపత్రాలను తయారు చేయించి ప్రతి వారం ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.
ప్రతి వారం సుమారు 80 మంది అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తూ వారి ప్రతిభను అంచనా వేయడంతో పాటు, పోటీ పరీక్షలకు మరింత సమర్థవంతంగా సిద్ధమయ్యేలా సాయికుమార్ ప్రోత్సహిస్తున్నారు. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో శ్రమిస్తున్న యువతకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తూ, ఆర్థిక భారం లేకుండా ప్రాక్టీస్ చేసే అవకాశం కల్పిస్తున్న సాయికుమార్ సేవలను పలువురు అభినందిస్తున్నారు. యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని వారు కోరుతున్నారు.

# వెల్దుర్తి మెదక్ డబల్ రోడ్డు నిర్మాణం కొరకు మహా పాదయాత్రను విజయవంతం చేయండి

- **మండల ప్రజలకు పిలుపునిచ్చిన బిఆర్ఎస్ నాయకులు**

**వెల్దుర్తి, ఆగస్టు 30, (సిరి న్యూస్):**



వెల్దుర్తి మెదక్ డబల్ రోడ్డు నిర్మాణం కొరకు నేడు జరగబోవు మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మండల నాయకులు పిలుపునిచ్చారు. వెల్దుర్తి మండల కేంద్రం నుండి పిల్లి కోటాల వరకు జరుగు మహా పాదయాత్రకు వెల్దుర్తి మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డిలు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఇట్టి కార్యక్రమంలో పాల్గొంటున్నారు కావున మండల ప్రజలు బి ఆర్ ఎస్ నాయకులు, ఇట్టి పాదయాత్రను విజయవంతం చేయాలని తెలిపారు. నిధులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల నిర్మాణంలో విఫలమైందని అన్నారు.
ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొంటూ, ప్రభుత్వానికి ప్రజల సమస్యలను తెలియజేసేలా పాదయాత్రకు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, మోహన్ రెడ్డి, కృష్ణ గౌడ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రంగి కృష్ణ,ప్రతాప్ రెడ్డి, తోట నరసింహులు, పడిగే నర్సింలు,అశోక్ రెడ్డి, అశోక్ గౌడ్, వెల్దుర్తి ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మండల ప్రజలను మోసం చేస్తున్న సునీత లక్ష్మారెడ్డి

- **తెలంగాణ రక్షణ సేన నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి చలంగారి దండే అపర్ణ**

**వెల్దుర్తి,ఆగస్టు 30,(సిరి న్యూస్):**

వెల్దుర్తి నుండి మెదక్ వరకు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని వాహనదారులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ అక్కడక్కడ యాక్సిడెంట్లు మరణాలు సంభవించిన ప్రభుత్వాలకు చీమకుట్టినట్టు కూడా ప్రభుత్వాలకు లేదని ప్రజలు ఎన్నోసార్లు విమర్శించారు. గతంలో బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రహదారి నిర్మాణం కోసం 18 కోట్ల రూపాయలు మంజూరు చేయించామని వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుకుందని తెలంగాణ రక్షణ సేన నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి చలం గరి దండే అపర్ణ ఆరోపించారు. ఆదివారం అపర్ణ విలేకరులతో మాట్లాడుతూ బి ఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో వెల్దుర్తి నుండి మెదక్ రోడ్డు విషయం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సునీత రెడ్డికి రోజురోజుకు ఆదరణ తగ్గుతుందని అందువల్లే ఎమ్మెల్యే సునీత రెడ్డి రాజకీయంగా లబ్ధి కోసమే పాదయాత్ర పేరిట కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శించారు. ఎన్ని పాదయాత్రలు చేసిన సునీతారెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అపర్ణ అన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ ఆయాములో మంజూరైన 18 కోట్ల రూపాయలు ఎటు పోయాయి, వెల్దుర్తి, ఉప్పు లింగాపూర్, రామయ్య పల్లి, బండపోసాని, పల్లి శెట్టిపల్లి కలాన్, ప్రజలను మోసం చేసి వాళ్ళ బాధలను పట్టించుకోక అవే 18 కోట్ల రూపాయలతో మీ సొంత మండలం శివ్వంపేట అభివృద్ధి కోసం ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. వెల్దుర్తి మండల ప్రజలకు మసి పూసి మారేడు కాయ చేసి ఇప్పుడు సవతి తల్లి ప్రేమ చూపెడుతూ రాజకీయ లబ్ధి కోసం రోడ్డు విస్తరణ పేరుతో మళ్లీ మండల ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.





# చిన్నారుల క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం..

- **రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి, కాటా సుధా శ్రీనివాస్ గౌడ్**

**రామచంద్రపురం, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 45వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026ను ఘనంగా నిర్వహించారు. కాటూరి శంకర్ రావు స్మారకార్థం బాలురు, బాలికల విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోటీతత్వ స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. క్రీడాకారులు పట్టుదలతో సాధన చేసి ఉన్నత స్థాయికి ఎదిగి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చిన్నారులను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న బాలురు, బాలికలకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.





వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులను వారు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్న మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వాహకులను ప్రశంసించారు.
కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కాటూరి శ్రీనివాస్ రావు, కార్యదర్శి వై. రామారావు, పారిశ్రామికవేత్త రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, కాలనీ అధ్యక్షులు బాలయ్య, భీమ్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బోనాల ఉత్సవాలు.. పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి..

**రామచంద్రాపురం, ఆగస్టు 30 (సిరి న్యూస్) :**

రామచంద్రాపురం డివిజన్‌లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి డివిజన్‌లోని ఐదు ఆలయాలను సందర్శించి పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం పాలారం బండి, ఎస్సీ బస్తీ, చాపల బస్తీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, చిన్న తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రామచంద్రపురం లో ఘనంగా ఓనం వేడుకలు..

- **పాల్గొన్న మహిపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి..**

**రామచంద్రాపురం, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గం విభిన్న సంస్కృతులు, ఆచారాలకు నిలయంగా ఉందన్నారు. కేరళ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఓనం పండుగను రామచంద్రాపురంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అన్ని వర్గాల పండుగలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.
ఓనం పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ప్రమోద్ గౌడ్, ఐలేష్, నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.









# ఘనంగా శ్రీశ్రీశ్రీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు..

- **కుటుంబ సభ్యులతో కలిసి బోనం సమర్పించిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**

**రామచంద్రాపురం, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

శ్రావణమాస బోనాల పండుగ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మందుముల శ్రీనివాస్ నగర్ కాలనీలో శ్రీశ్రీశ్రీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాది కొనసాగుతున్న సంప్రదాయంలో భాగంగా రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇంటి నుంచి బోనం, తొట్టెలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి బోనం, తొట్టెలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి.



# నెన్నెల నుంచి బెల్లంపల్లి వరకు.. రాజకీయ రగడ!..

- **నెన్నెల నుంచి బెల్లంపల్లికి చేరిన రాజకీయ వేడి..**
- **బీఆర్ఎస్ నేతలపై కేసులతో ముదిరిన వివాదం..**
- **పోలీసుల తీరుపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం..**
- **ఏసీపీ కార్యాలయం, కమిషనరేట్ ముట్టడికి సిద్ధం!..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 30 (సిరి న్యూస్)**

నెన్నెల మండలంలో బీఆర్ఎస్ నాయకులపై నమోదైన కేసులు ఇప్పుడు బెల్లంపల్లి రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రాజకీయ కక్షసాధింపుతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించడంతో వివాదం మరింత ముదిరింది. ఈ వ్యవహారంపై మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీవ్రస్థాయిలో స్పందించారు. నెన్నెల సర్పంచ్ ఇబ్రహీం రైస్ మిల్లులో సుమారు రూ.4.79 కోట్ల మోసం జరిగిందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో.. ఓ ఎస్సీ మహిళను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపించాయి. అధికార బలంతో పోలీసు యంత్రాంగాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపించాయి..

**దుర్గం చిన్నయ్య ఘాటు హెచ్చరిక..**

బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని దుర్గం చిన్నయ్య హెచ్చరించారు. పోలీసుల వ్యవస్థను చేతిలో పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తూ. అవసరమైతే బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయం, రామగుండం పోలీసు కమిషనరేట్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు..

**ఫిర్యాదుపై కేసు ఎందుకు కాదు?..**

నందులపల్లి సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇద్దరు ప్రభుత్వ అధికారులు అధికారికంగా పిలిచిన నేపథ్యంలో సంబంధిత వ్యక్తులు హాజరైన ఘటనకు సంబంధించిన దృశ్యాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఓ ఎస్సీ బీఆర్ఎస్ నాయకుడిని కులం పేరుతో దూషిస్తూ అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన ఘటనకు సంబంధించిన దృశ్యాలు కూడా ఉన్నాయని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఆరోపణలపై పోలీసుల స్పందన, తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. ఈ పరిణామాల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే పాలేరు పేరు కూడా రాజకీయ ఆరోపణల్లోకి రావడంతో బెల్లంపల్లి రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. నెన్నెలలో మొదలైన వివాదం ఇప్పుడు బెల్లంపల్లి నుంచి రామగుండం వరకు రాజకీయ పోరుగా మారుతుందా? అన్న చర్చ జోరందుకుంది.



# ప్రవక్త మహమ్మద్ బోధనలు మానవాళికి ఆదర్శం..

**హత్నూర, ఆగస్టు 30,(సిరి న్యూస్):**

మహమ్మద్ ప్రవక్త పవిత్ర మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ఏ సయ్యద్ అహ్మద్ షా ఖాద్రి బుఖారి రహమతుల్లా అలై, బర్గాలో లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మస్జిద్‌కు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు తరలివచ్చి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను, ఆయన మానవాళికి అందించిన సందేశాన్ని వివరించారు. ప్రవక్త మహమ్మద్ చూపిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, దయ, సోదరభావం, క్షమాగుణం వంటి విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. పేదలు, అనాథలు, బలహీన వర్గాల పట్ల దయతో వ్యవహరించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రవక్త బోధనల్లో ముఖ్యమైన అంశాలని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మస్జిద్‌లో ప్రత్యేక దువా నిర్వహించారు. కార్యక్రమంలో ముక్య అతిథులుగా సబీర్ హుస్సేన్ , సాదిక్ హుస్సేన్, షేక్ హుస్సేన్, నిర్వాహకులు షకీల్ అహ్మద్ సభ్యులు, మతపెద్దలు, యువకులు, పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# అక్కడ పెళ్లి - ఇక్కడ అక్షింతలు

- **అమెరికాలో కూతురు వివాహం**
- **తెలంగాణలో టీవీలో చూస్తూ అక్షింతలు వేసి, ఆశీర్వదించిన తల్లిదండ్రులు**
- **పెళ్ళితో ఒక్కటైన ప్రేమ జంట హిమబిందు - రోహిత్ కుమార్**
- **వీడియో వైరల్**

**నల్లగొండ,ఆగస్ట్30, సిరి న్యూస్:**

కన్న కూతురు వివాహం జరుగుతుంటే టీవీలో చూస్తూ అక్షింతలు వేసి ఆశీర్వదించిన సంఘటన అందరినీ ఆశ్చర్య పరిచింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజుర్నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన జయరాజు జ్యోతి దంపతులకు హిమబిందు ఒక్కతే కూతురు. అమెరికాలో చదువు పూర్తిచేసుకుని ఉద్యోగం చేస్తున్నది. అక్కడే ఉద్యోగం చేస్తూ పరిచయం అయిన ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రోహిత్ కుమార్ ను ప్రేమించింది. తమ ప్రేమ గురించి తెలిపి పెళ్లి చేసుకుంటున్నామని, అమెరికాలో హిందూ సంప్రదాయ బద్దంగా జరుపుకుంటున్న వివాహ మహోత్సవాన్ని ఇంటర్ నెట్ ద్వారా టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. భారత కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో కూతురు హిమబిందు మెడలో అల్లుడు రోహిత్ మూడు ముళ్ళు వేస్తుండగానే ఇక్కడ తల్లిదండ్రులు జయరాజ్, జ్యోతి దంపతులు టీవీ పై అక్షింతలు చల్లి ఇక్కడి నుంచే వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని బంధుమిత్రుల సమక్షంలో ఏర్పాటు చేసి వచ్చిన వారికి వివాహ విందును ఘనంగా ఏర్పాటు చేశారు తల్లిదండ్రులు. పెళ్లి చూపులు ఆన్ లైన్ లో చూసుకోవడం చూశాం కానీ పెళ్లి కూడా అదీ తల్లిదండ్రులు లేకుండా వారు టీవీలో చూస్తుండగా చేసుకోవడం మేము ఇప్పుడే చూస్తున్నాం అంటూ ఆశ్చర్యంతో కూడిన సంతోషాన్ని అక్కడికి వచ్చిన వారు వ్యక్తం చేశారు.

# పాదయాత్రతో రాజకీయ డ్రామాలా?

- **పదేళ్లలో రోడ్డు ఎందుకు పూర్తి చేయలేదు?**
- **మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి**
- **ప్రజలకు సమాధానం చెప్పాలి.**
- **నిజాంపేట మండల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధుల డిమాండ్**

**రామాయంపేట, (నిజాంపేట)ఆగస్టు 30 (సిరి న్యూస్)**



పదేళ్ల పాలనలో పట్టించుకోని రహదారి సమస్యపై ఇప్పుడు పాదయాత్రల పేరుతో రాజకీయ డ్రామాలు చేయడం ఎందుకని నిజాంపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రావిపల్లి అమర్సేనారెడ్డి ప్రశ్నించారు. చల్మెడ-నందగోకుల్ రహదారి పనులు అప్పట్లో ఎందుకు పూర్తి చేయలేకపోయారో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

**ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. నిజాంపేట**

మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పదేళ్లపాటు అధికారంలో ఉండి పరిష్కరించని సమస్యను ఇప్పుడు రాజకీయంగా వాడుకోవడం సరికాదన్నారు. రహదారి పనులకు నిధులు మంజూరైనప్పటికీ పూర్తి చేయని వారు.. ప్రస్తుతం ప్రజల కోసం పోరాడుతున్నట్లు పాదయాత్రలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్నప్పుడే పరిష్కరించాల్సిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు.

ఈ సమావేశంలో సర్పంచ్ రామచందర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు మహేందర్, నసీరోద్దీన్, కల్వకుంటకు చెందిన చింతల స్వామి, బాబు, లింగంగౌడ్ పాల్గొన్నారు.

# చక్కెర ధర చెదిరేలా.. ఉల్లి ధర ఘాటెక్కేలా

- **నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యుడిపై పెను భారం**
- **రోజురోజుకు పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి కుటుంబాల సతమతం**

**గుమ్మడిదల, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య ప్రజానీకంపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. ఇప్పటికే పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి కుటుంబాలకు మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది. కుటుంబ అవసరాలకు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన సరుకుల ధరలు పెరగడంతో నెలవారీ బడ్జెట్‌ను ఎలా సర్దుబాటు చేసుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చక్కెర ధర కిలో రూ.80 వరకు పలుకుతుండటంతో చక్కెర కొనుగోలు కూడా భారంగా మారిందని వినియోగదారులు వాపోతున్నారు. టీ, కాఫీతో పాటు ఇంట్లో తయారు చేసే పలు ఆహార పదార్థాల్లో ప్రతిరోజూ ఉపయోగించే చక్కెర ధర పెరగడం సామాన్య కుటుంబాలపై ప్రభావం చూపుతోంది. ఉల్లిపాయ ధరలు కూడా వినియోగదారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ప్రస్తుతం రూ.100కు సుమారు రెండు కిలోల ఉల్లిపాయలు మాత్రమే లభిస్తుండటంతో వంటల్లో ఉల్లిపాయ వినియోగాన్ని తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు చెబుతున్నారు. ప్రతిరోజూ వంటల్లో ఏదో ఒక రూపంలో ఉపయోగించే ఉల్లి, చక్కెర వంటి నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజలకు అదనపు భారం తప్పడం లేదు. ఇప్పటికే కూరగాయలు, పప్పులు, నూనెలు తదితర నిత్యావసర





వస్తువుల ధరలు కుటుంబ బడ్జెట్‌ను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో చక్కెర, ఉల్లిపాయల ధరలు కూడా పెరగడం సామాన్యులకు మరింత ఇబ్బందికరంగా మారింది. మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారి గతంలో కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు మార్కెట్లను పర్యవేక్షించి, కృత్రిమ కొరత లేదా అధిక ధరలకు విక్రయించే పరిస్థితులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ధరలు అదుపులోకి వచ్చేలా చర్యలు తీసుకుని సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.






# విశ్వశాంతి కోసం 19వ మహా పాదయాత్ర..

- **పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగిన యాత్ర**

**పటాన్‌చెరు, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

శ్రావణమాసం పురస్కరించుకుని విశ్వశాంతి, ప్రజల్లో ప్రేమ, అనురాగం, ఐక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో 19వ మహా పాదయాత్రను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీ శ్రీ ఉమా మహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం వరకు పాదయాత్ర కొనసాగింది.

పాదయాత్రను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 19 సంవత్సరాలుగా పాదయాత్రను కొనసాగించడం అభినందనీయమని, మహాత్మా బసవేశ్వరుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు.

ఈ పాదయాత్రలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వశాంతి, ప్రజల్లో ప్రేమ, అనురాగం, ఐక్యత కోసం పాదయాత్ర నిర్వహించడం శుభపరిణామమన్నారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

పాదయాత్రలో భాగంగా ఇంద్రేశం వద్ద సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ పాదయాత్ర బృందాన్ని కలిసి యాత్రలో పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక పాదయాత్రలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్, సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొల్కురి నరసింహ రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డోకూరు రాంమోహన్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సపాన దేవ్, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నాగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు ఉపేందర్, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు అశోక్ రాజు, దేవ, యువరాజ్, సాయి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో..మెగా బ్రేక్‌ఫాస్ట్ మిషన్..

- 50 వేల మందికి.. ఒకే వంటశాల..
- మూడు జిల్లాలకు.. పోషకాహారం..
- గంటలో 5,600 ఇడ్లీలు.. 3,600 పూరీలు..
- 31న భారీ కేంద్రీకృత వంటశాల ప్రారంభం..







**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 30 (సిరి న్యూస్)**

వేలాది మంది విద్యార్థుల ఉదయపు ఆకలికి చెక్.. పోషకాహారంతో చదువుపై ఏకాగ్రతకు బాట! తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పాఠశాల అల్పాహార కార్యక్రమంలో భాగంగా మంచిర్యాలలో రోజుకు ఏకంగా 50 వేల మందికి అల్పాహారం అందించే భారీ కేంద్రీకృత సామూహిక వంటశాల అందుబాటులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని వైద్య గోదాములో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ వంటశాలను ఈ నెల 31న ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు..

**691 పాఠశాలలు.. 13 కళాశాలలు..**

మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 42,450 మంది విద్యార్థులు, 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 6,654 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం పొందనున్నారు..

**గంటలో వేలాది అల్పాహారాలు!..**

వంటశాలలో ఏర్పాటు చేసిన స్వయంచాలక ఆవిరి వంట యంత్రాలతో గంటకు 5,600 ఇడ్లీలు, దోశ తయారీ యంత్రంతో 2 వేల దోశలు, పూరీ తయారీ యంత్రంతో 3,600 పూరీలు తయారు చేయగల సామర్థ్యం ఉంది. సాంబార్, కూరల తయారీ విభాగాల ద్వారా రెండు గంటల్లో 5 వేల మందికి సరిపడా ఆహారం, బియ్యం వండే పరికరాలతో కేవలం 40 నిమిషాల్లో వెయ్యి మందికి సరిపడా అన్నం సిద్ధమవుతుంది..

**నాణ్యతకు ప్రత్యేక ప్రయోగశాల..**

సుమారు 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ వంటశాలలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతకు పెద్దపీట వేశారు. ఆహార పరీక్షా ప్రయోగశాల, పాల శుద్ధి కేంద్రం, శుద్ధి చేసిన నీటి కేంద్రం, ఆవిరి ఉత్పత్తి కేంద్రం, కేంద్రీకృత వంటగ్యాస్ నిల్వ కేంద్రం, స్వయంచాలక కూరగాయల శుభ్రపరిచే, తరిగే యంత్రాలు వంటి ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేశారు..

**మూడు జిల్లాలకు..**
**వేలాది కుటుంబాలకు ఊరట..**

మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం, మందమర్రి, లక్సెట్టిపేట, దండేపల్లి, కాజీపేట, నెన్నాల్, హాజీపూర్, నాస్పూర్, భీమారం, జగిత్యాల జిల్లాలోని వెల్లటూరు, ఎండపల్లి, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఈ వంటశాల ద్వారా అల్పాహారం అందనుంది..

**సేవా సంస్థ భాగస్వామ్యం..**
**సింగరేణి ఆర్థిక సహకారం..**

ఈ కార్యక్రమం అమలులో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామిగా వ్యవహరిస్తుండగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా వంటశాల నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించింది..

**ఆకలికి చెక్.. చదువుపై ఫోకస్!..**

ఉదయం ఆకలి లేకుండా.. ఆరోగ్యకరమైన అల్పాహారంతో పాఠశాలకు.. ఉత్సాహంగా విద్యాభ్యాసం అన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జాతీయ పోషకాహార సంస్థ సూచనల మేరకు వారపు ఆహార పట్టికను రూపొందించినట్లు పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, పోషకాహారం, ఏకాగ్రత, విద్యాభ్యాసంపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు.







# వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాస సందడి

- భక్తులతో కిటకిటలాడిన బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం
- ప్రత్యేక పూజలు, లక్ష బిల్వార్చనలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**గుమ్మడిదల, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

శ్రావణమాసం సందర్భంగా గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన ఈ ఆలయానికి ఆదివారం సెలవు దినం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక పెరగడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. శ్రావణమాసం శివారాధనకు అత్యంత విశిష్టమైన మాసంగా భావిస్తుండటంతో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతమంతా భక్తుల రాకతో సందడిగా మారింది.

**ప్రత్యేకంగా లక్ష బిల్వార్చన**

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేకంగా లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బిల్వదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. భక్తిశ్రద్ధలతో బిల్వార్చనలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారు. శ్రావణ మాసంలో ప్రతి ఆదివారం, సోమవారం, ఇతర సెలవు రోజులతో పాటు చివరి సోమవారం, చివరి శుక్రవారం రోజుల్లో ఆలయానికి భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

**సత్యనారాయణ స్వామి వ్రతాలకు ప్రత్యేక ఏర్పాట్లు**

ఆలయంలోని సత్యనారాయణ స్వామి మండపంలో కూడా భక్తులు పెద్ద ఎత్తున సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు వ్రతాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వ్రతాల అనంతరం ప్రసాదాలను స్వీకరించారు. ఒకేరోజు పలువురు భక్తులు వ్రతాలు నిర్వహించుకోవడంతో సత్యనారాయణ స్వామి మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

**పెరుగుతున్న భక్తుల తాకిడి**

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయానికి గత కొంతకాలంగా భక్తుల రాక గణనీయంగా పెరుగుతోంది. శ్రావణమాసం, పర్వదినాలు, సెలవు రోజుల్లో పరిసర ప్రాంతాలతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శనం, క్యూలైన్లు, పూజా కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచడంతో పాటు పూజా కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. శ్రావణ మాసం ముగిసే వరకు భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉండటంతో ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణ అధికారి రామబ్రహ్మచారి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, ఆలయ సిబ్బంది సోమయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: గాంధీ..

**రామచంద్రపురం, ఆగస్టు 30 (సిరి న్యూస్) :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కృప, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోనాల ఉత్సవాల కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 92 దేవాలయాలకు రూ.30.71 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలకు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బోనాల ఉత్సవాలను జరుపుకోవాలని గాంధీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2న మున్సిపల్ కార్మికుల పట్టణ మహాసభను జయప్రదం చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వల్లపు దాసు సాయికుమార్ పిలుపునిచ్చారు.
- మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని.
- పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30 సిరి న్యూస్:**

సెప్టెంబర్ 2న మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగే మున్సిపల్ కార్మికుల పట్టణ మహాసభను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వల్లపు దాసు సాయికుమార్ పిలుపునిచ్చారు. సూర్యాపేటలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజలకు నిరంతరం పారిశుద్ధ్య సేవలు అందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, యూనిఫాం, సౌకర్యాలు కల్పించడంతో పాటు పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించేందుకు సెప్టెంబర్ 2న జరిగే పట్టణ మహాసభ కీలకంగా నిలుస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చాగంటి వెంకటరమణ, బాలెన్లబాబు, బొజ్జ బాలకృష్ణ, జానపాటి యాదగిరి, రాము, బందారు మమత తదితరులు పాల్గొన్నారు.








# సేవా కార్యక్రమాలతో చైర్మన్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

- విద్యార్థులకు పండ్లు, భోజనాల పంపిణీ
- సికేజీ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం

**గుమ్మడిదల, ఆగస్టు 30 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సికేజీ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలను నిర్వహించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా విద్యార్థుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుమ్మడిదలలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు భోజనాలను ఏర్పాటు చేసి అందజేశారు. నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల పురపాలక సంఘానికి చైర్మన్‌గా ఎన్నికైన చిన్నపాపని కుమార్ గౌడ్ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారని సికేజీ యువసేన సభ్యులు తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులకు చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా, యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి ఆంజనేయులు నల్తూరి సాయికుమార్, మధు గౌడ్, చిరుమని శ్రీనివాస్, కుంటి రవి, నరేష్, నల్ల రవి, నల్ల రాజు, పాదాల ప్రసాద్, నల్ల ప్రశాంత్, హరీష్, జైపాల్, శ్రీకాంత్, మహేష్,హుస్సేన్ గౌడ్, కొక్కరకొండ శ్రీనివాస్, వీరేష్, సిద్ధు, నల్ల రాజు గౌడ్, సురేష్, కాళీ తదితరులు పాల్గొన్నారు

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలి**

సికేజీ యువసేన సభ్యులు మాట్లాడుతూ కుమార్ గౌడ్ రాజకీయ జీవితంలో ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ ముందుకు సాగుతున్నారని అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గుమ్మడిదల పురపాలక సంఘం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. కుమార్ గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం లభించాలని యువసేన సభ్యులు ఆకాంక్షించారు. పదవులు మారినా ప్రజలతో ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవాలని కోరారు. గుమ్మడిదల ప్రాంత అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేలా తన సేవా ప్రస్థానాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

**విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు**

జన్మదినోత్సవం సందర్భంగా గుమ్మడిదల ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులతో కలిసి సికేజీ యువసేన సభ్యులు జన్మదిన వేడుకలను నిర్వహించారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా యువతలో సామాజిక బాధ్యత పెంపొందుతుందని వారు పేర్కొన్నారు. కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సికేజీ యువసేన ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ద్వారా విద్యార్థులతో సంతోషాన్ని పంచుకోవడం ఆనందంగా ఉందని సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు అండగా నిలిచేలా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు.

# జామాకుతో ఇన్ని ప్రయోజనాలా!



జామ పండ్లు... గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో విరివిగా లభించే ఈ పండ్లంటే అందరికీ ఇష్టమే... అయితే జామ పండ్లను ఇష్టంగా తినే వాళ్లు ఆకులను మాత్రం ఎవరూ పట్టించుకోరు.. అదేంటి ఆకులను ఎవరైనా తింటారా? అని నవ్వుకోకండి. ఈ జామ ఆకుల్లో ఎన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. మరెన్నో ఔషధ గుణాలున్నాయి, జామ ఆకులు అనేక వ్యాధులను నయం చేయడానికి ఉపయోగిస్తారు. వైద్యం లక్షణాలను బట్టి సాంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగిస్తున్నారు. జామ ఆకుల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జీర్ణక్రియకు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మాన్ని మెరుగుపరచడానికి, జుట్టు పెరుగుదలకు కూడా సహాయపడతాయి. మరి ఇలాంటి ఎన్నో ఆరోగ్య రహస్యాలను దాచుకున్న జామ ఆకుల గురించి తెలుసుకోండి....

విటమిన్లు: జామ ఆకుల్లో విటమిన్లు సి, ఎ ఉన్నాయి. విటమిన్ సి వ్యాధులతో పోరాడటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. విటమిన్ ఎ కళ్లు, చర్మాన్ని రక్షిస్తుంది.
ఖనిజాలు: ఈ ఆకులు పొటాషియం వంటి అవసరమైన ఖనిజాలను అందిస్తాయి. పొటాషియం గుండెకు మంచిది. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.
యాంటీఆక్సిడెంట్లు: జామ ఆకులు మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ అని పిలిచే హానికరమైన పదార్థాల నుంచి రక్షిస్తాయి.



## జామ ఆకుల పది ఆరోగ్య ప్రయోజనాలు

**1. జీర్ణ ఆరోగ్యం:**
జామ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలున్నాయి, ఇవి పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాటి అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియకు సహాయపడుతుంది, మలాన్ని మృదువుగా చేసి మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన జీర్ణవ్యవస్థను పెంపొందిస్తుంది.
**2. బ్లడ్ షుగర్ లెవెల్:**
షుగర్ వ్యాధి ఉన్నవారికి లేదా ముప్పు ఉన్న వారికి జామ ఆకులు మంచివి. ఇది గ్లూకోజ్ స్థాయిలను స్థిరీకరిస్తుంది. భోజనం తర్వాత రక్తంలో చక్కెరలో పెద్ద స్పైక్‌లను నివారిస్తుంది.
**3. రోగ నిరోధక వ్యవస్థ మెరుగు:**
జామ ఆకుల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. శరీరం రక్షణ విధానాలను పెంచడం ద్వారా, అవి వ్యాధులు, ఇతర ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి, ఆరోగ్యంగా ఉంచుతాయి.
**4. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది:**
జామ ఆకులలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్‌స్‌ను తటస్థీకరిస్తాయి. ఇది క్యాన్సర్‌కు దారితీసే కణాల నష్టం మరియు ఉత్పరివర్తనాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రెగ్యులర్ వినియోగం కొన్ని రకాల క్యాన్సర్ల నుండి రక్షణను అందిస్తుంది.
**5. గుండెను పదిలం:**
జామ ఆకులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను మెరుగుపరిచి గుండె ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.
**6. కంటి చూపుకు మంచిది:**
జామ ఆకులలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది, ఇది మంచి కంటి చూపుకు అవసరం. ఈ ఆకులను తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యానికి తోడ్పడుతుంది. దృష్టిని పదునుగా చేస్తుంది. కంటి సంబంధిత సమస్యల నుంచి రక్షిస్తుంది.
**7. యాంటీ స్ట్రెస్ ఏజెంట్:**
జామ ఆకులు ఒత్తిడిని తగ్గించే గుణాలను కలిగి ఉంటాయి. ఇవి ఆందోళనను తగ్గించడంలో, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో సహాయపడతాయి. ఒత్తిడితో కూడిన సమయాల్లో ప్రశాంతంగా, రిలాక్స్‌గా ఉండటానికి అవి సహాయపడతాయి.
**8. బరువు తగ్గుతారు:**
జామ ఆకులు జీవక్రియను పెంచుతాయి, బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.ఇవి కేలరీలను సమర్థవంతంగా బర్న్ చేస్తాయి. బరువు తగ్గించే ప్రయత్నాలకు అదనపు ప్రయోజనకంగా ఉంటాయి.
**9. ఋతుస్రావం నొప్పి తగ్గిస్తాయి**
జామ ఆకులు ఋతు స్రావం నొప్పిని, అసౌకర్యానికి ఉపశమనం కలిగిస్తాయి. మహిళలకు తిమ్మిరిని తగ్గించగలవు. పీరియడ్స్ సక్రమంగా వచ్చేలా ఉపయోగపడతాయి.
**10. జుట్టు, చర్మానికి మేలు:**
జామ ఆకులలో యాంటీ బాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి మొటిమలను తగ్గేంచేందుకు సహాయపడతాయి. అలాగే చర్మాన్ని బిగుతుగా ఉంచడం ద్వారా, ముడతల రూపాన్ని తగ్గించేందుకు పని చేస్తాయి. ఈ ఆకులు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి, అలాగే జుట్టు ఆరోగ్యాన్ని రక్షిస్తాయి.
జామ ఆకులు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్నా... అలెర్జీలు ఉన్న వారు, చర్మం సున్నితంగా ఉన్న వారు, ఏవైనా మందులు వాడుతున్న వారు వీటిని వాడటంలో తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలి.



# 'డీప్ ఫ్రై'లతో డేంజర్!



రోజూవారీ ఆహారంలో భాగంగా చాలా ఇళ్లల్లో ఫ్రైలకు అధిక ప్రాధానత్య ఇస్తుంటారు. పప్పులు.. కూరలు.. మాంసాలు మామూలుగా వండుకు తింటే బాగానే ఉంటుంది. కానీ మరగకాగిన నూనెల్లో వేయించుకు తింటే అది ఎంతమాత్రం మంచిది కాదని వైద్యులు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి లంచ్‌లో అయినా డిన్నర్‌లో అయినా కర్రీతో పాటు పక్కన ఫ్రై ఐటెమ్స్ ఉండాల్సిందే. కమ్మగా కరకరలాడుతూ.. కాస్త కారంకారంగా ఉండే ఫ్రైలు ఎవరికైనా నచ్చేస్తాయి.అలాగే ఈ ఫ్రైలను ఫాస్ట్ గా వండేయొచ్చు. పెద్ద ఖర్చు అవ్వదు. పైగా అంతా ఇష్టంగా తింటారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా హోటళ్లలో, ఫాస్‌ట్‌ఫుడ్ సెంటర్లలో ఈ ఫ్రైడ్ ఐటెమ్స్ దే హవా! అలూ చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్.. ఫ్రైడ్ ఫిష్.. చికెన్ స్ట్రిప్స్.. చీజ్ స్టిక్స్.. రుచి విషయంలో వీటి గురించి మరో ఆలోచనే అక్కర్లేదు. కానీ బాగా మరగకాగిన నూనెలో ముంచి తీసే వాటితో ఎన్నో నష్టాలున్నాయ్...

**క్యాలరీల టెన్షన్...**
ఫ్రై చేసిన వంటకాల నుంచి వచ్చే క్యాలరీలు చాలా ఎక్కువ. ఎందుకంటే ముక్కలను వేడివేడి నూనెలో ముంచి తీసినప్పుడు వాటిలో ఉండే నీరంతా ఆవిరైపోతుంది, ఇదే సమయంలో అవి నూనెను బాగా పీల్చుకుంటాయి. నూనె వంటి కొవ్వుల నుంచి మనకు అందే క్యాలరీలు చాలా చాలా ఎక్కువ. అందుకే ఉడికించటం, నిప్పుల మీద కాల్చటం వంటి పద్ధతుల్లో వండిన వాటికంటే నూనెలో ఫ్రై చేసిన వాటి నుంచి మనకు ఎక్కువ క్యాలరీలు అందుతాయి.
చిన్న ఉదాహరణ చూద్దాం. 100 గ్రాముల ఆలూ ముక్కలను ఉడికించామనుకోండి... దాన్నుంచి మనకు దాదాపు 93 క్యాలరీల శక్తి అందుతుంది, కొవ్వు పెద్దగా ఉండదు. అదే ఆలూ ముక్కలను వేడివేడి నూనెలో వేసి బాగా కరకరలాడేలా వేయించామనుకోండి.. వాటి నుంచి దాదాపుగా 17 గ్రాముల కొవ్వు, 319 క్యాలరీల శక్తి అందుతాయి. అలాగే 100 గ్రాముల చేప ముక్కలను ఉడికిస్తే వాటి నుంచి 105 క్యాలరీల శక్తి, 1 గ్రాము కొవ్వు మాత్రమే అందుతాయి. అదే చేప ముక్కలను నూనెలో వేయిస్తే 232 క్యాలరీల శక్తి, 12 గ్రాముల వరకూ కొవ్వు అందుతాయి. కాబట్టి మనం వండే పద్ధతి వల్ల కొవ్వు, క్యాలరీలు పెరిగిపోతాయని, తరచూ ఫ్రైలను తింటుంటే దీని వల్ల ఊబకాయం, మధుమేహం వంటి చాలా రకాల సమస్యలు పొంచి ఉంటాయని గుర్తించాలి.

**రోగాలనూ రుచి చూడాల్సిందే!**
గుండె జబ్బులు: ఫ్రైడ్ ఐటెమ్స్ ని ఎంత ఎక్కువ తింటుంటే గుండె జబ్బుల ముప్పు అంత ఎక్కువగా పెరుగుతోందని ఇటీవలి కాలంలో జరిగిన రెండు అతి పెద్ద అధ్యయనాల్లో గుర్తించారు. తరచూ వేపుళ్లు తింటున్న వారిలో హైబీపీ సమస్య ఎక్కువగా ఉంటోంది, మరోవైపు మంచి కొలెస్ట్రాల్ స్థాయులు ఉండాల్సినంత ఉండటం లేదు. ఈ రెండూ గుండె జబ్బుల ముప్పును పెంచుతున్నాయి.
మధుమేహం: ఫ్రైడ్ ఐటెమ్స్ వారానికి ఒకసారి తింటున్న వారితో పోలిస్తే.. వారానికి 46 సార్లు తింటున్న వారిలో మధుమేహం వచ్చే ముప్పు 39% అధికంగా ఉంటోంది. వాటిలో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల వల్ల బరువు పెరగటంతో పాటు ఆకలిని నియంత్రించే హార్మోన్లు కూడా అస్తవ్యస్తమైపోతున్నాయని, ఇది మధుమేహం, ఊబకాయాలకు దారి తీస్తోందని గుర్తించారు.
క్యాన్సర్లు: వండేప్పుడు ఆహార పదార్థాలను అత్యధిక ఉష్ణోగ్రతల వద్దకు తీసుకెళ్తే అందులో 'ఆక్రిలమైడ్' అనే విషతుల్యమైనది తయారవుతుంది. పొగలొస్తున్న నూనెల్లో వేయించటం, మండే నిప్పుల మీద కాల్చటం, మాడ్చటం వంటి వాటి వల్ల ఈ రసాయనిక చర్య జరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఆలుగడ్డల వంటి వాటిలో ఉండే పిండిపదార్థాలు, చక్కెరలు, ఆస్పరాజిన్ అనే అమైనో ఆమ్లం ఇలాంటి వాటన్నింటి మధ్యా రసాయన చర్యలు జరిగి 'ఆక్రిలమైడ్' తయారవుతోంది. ఇది చాలా రకాల క్యాన్సర్లకు కారణమవుతోందని జంతువులపై జరిగిన పలు అధ్యయనాల్లో తేలింది.



**నూనెను మళ్లీ మళ్లీ వేడి చేస్తున్నారా?**
వంట నూనెలను మరగకాచినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వద్ద దానిలో రసాయనిక స్వభావం మారిపోయి అవి 'ట్రాన్స్ ఫ్యాట్స్' రకం కొవ్వులుగా మారిపోతాయి. ఈ తరహా కొవ్వులను మన శరీరం తేలికగా అరిగించుకోలేదు. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి చాలా రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. బయట ప్యాకెట్లలో దొరికే ఫ్రైడ్ ఐటెమ్స్ తో కూడా ఈ సమస్య తప్పదు. వంట నూనెను మన ఇళ్లలో, హోటళ్లలో కూడా ఒక్కసారి వాడి వదిలేయరు. అవసరమైనప్పుడల్లా మరగకాచి వండుతుంటారు, మళ్లీ దాచుకుంటారు. ఇలా ఒకసారి కాచిన నూనెనే మళ్లీ మళ్లీ వేడి చేయడం వల్ల వాటిలోని ప్రమాదకర ట్రాన్స్ ఫ్యాట్స్ స్థాయు మరింత పెరిగిపోతుందని పరిశోధకులు స్పష్టంగా గుర్తించారు. ఫ్రైలు చేయాలంటే నూనెను విపరీతంగా వేడి చేయ తప్పదు, ఆ నూనెతో అనారోగ్య తప్పవు.

**ఇలా చేస్తే బెటర్..**
ఫ్రైడ్ ఐటెమ్స్ తరచూ తినకుండా ఉండటం మంచిది. వీటిని ఎప్పుడైనా ఓసారి తింటే అంత ప్రమాదం ఏం ఉండదు. ఫాస్ట్ గా అయిపోతాయని, టేస్టీగా ఉంటాయని... ప్రతి కూరగాయని, మాంసాన్ని, దుంపలను నూనెలో ఫ్రై చేయకుండా ఇతర పద్ధతులపై దృష్టి పెట్టాలి. ఉడికించి వండుకోవడం, మామూలు కూరలుగా చేసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక ఫ్రైలు తినకుండా ఉండలేమంటే ఓవెన్‌లోనో, ఎయిర్ ఫ్రైయర్లలోనో చేసుకుంటే నూనెలో ముంచి తియ్యాల్సిన పని లేకుండానే ముక్కలు కరకరలాడుతూ టేస్టీగా ఉంటాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.